క్లుప్తంగా

జోన్-5కు రెండే అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న జోన్-5 కమిషనర్ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు వినతులే అందాయి. జోనల్ కమిషనర్ బి.రాము అర్జీలను స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 01, యూసీడీ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా ఫిర్యాదులను తక్షణ పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, దిలీప్‌కుమార్, డీఈ భరణి, ఏఈ రత్నాకర్ ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, టౌన్ ప్లానింగ్ టీపీవో ప్రవీణ్ కుమార్, సర్వేర్ లీలా పాల్గొన్నారు.

వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ

మల్కాపురం: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా చిన్నారులు, పెద్దల కోసం యోగా, సంకీర్తనలు, కోలాటం, భగవద్గీత పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం వంటి అంశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. 61వ వార్డు వెంకన్నపాలెం ప్రాంతానికి చెందిన శ్రీ వాసుదేవ అన్నమయ్య సంకీర్తనా సంస్థానం ఆధ్వర్యంలో వెంకన్నపాలెంలోని మురళీకృష్ణ మందిరం వద్ద ఈ ఉచిత శిక్షణ తరగతులు జరుగుతాయి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు వివిధ అంశాలపై ఉచిత శిక్షణ ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. వెంకన్నపాలెంలోని మురళీకృష్ణ ఆలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు

మల్కాపురం : స్థానిక జ్ఞానేశ్వర్ ట్యుటోరియల్స్ ఆధ్వర్యంలో 60వ వార్డు జవహర్‌నగర్ సేవా మార్గంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి, పేద మహిళలు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు కలిదిండి బద్రీనాథ్, గజపతిరావు, బీజేపీ పశ్చిమ నాయకులు పోలిమేర శ్రీను, బీజేపీ గాజువాక కన్వీనర్ నర్సింగరావు ప్రారంభించారు.

యాదవులకు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలి

మల్కాపురం : జీవీఎంసీ డిప్యూటీ మేయర్ పదవిని యాదవులకు కేటాయించాలని పారిశ్రామిక ప్రాంత యాదవ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. డిప్యూటీ మేయర్ పదవి అంశంపై సోమవారం 59వ వార్డు శాంతిగిరి కాలనీలోని గోకుల కృష్ణ సామాజిక భవనం వద్ద యాదవ సంఘాల ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం ప్రతినిధి పుర్రె అప్పారావు యాదవ్ మాట్లాడుతూ, జిల్లాలో యాదవులు అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. అధిక సంఖ్యలో ఉన్న తమకు తగిన ప్రాధాన్యత కల్పించే విధంగా కూటమి నాయకులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. డిప్యూటీ మేయర్ పదవిని తమ సామాజిక వర్గానికి ఇచ్చి గుర్తించాలని కోరారు.

సెయింట్ జోసెఫ్‌ను సందర్శించిన మిజోరాం విద్యార్థులు



మిజోరాం విద్యార్థులతో కళాశాల సిస్టర్లు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలను మిజోరాం విశ్వవిద్యాలయం విద్యార్థుల బృందం సోమవారం సందర్శించింది. ప్రొఫెసర్ రాజశేఖర్ నేతృత్వంలో 27 మంది విద్యార్థుల ప్రతినిధులు విశాఖలోని పలు విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల సందర్శనార్థం వచ్చారు. అందులో భాగంగా సెయింట్ జోసెఫ్ కళాశాలలో విద్యుచ్ఛక్తి, మౌలిక సదుపాయాలను అధ్యయనం చేయడానికి వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. 130 ఏళ్ల చరిత్ర కలిగిన కళాశాల భవనాలను విద్యార్థులు పరిశీలించారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హేమ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ మాణిక్యకుమారి, సిస్టర్ మేరీ, సిస్టర్ డైసీ, సిస్టర్ నాన్సీ, డాక్టర్ అరుణాదేవి పాల్గొన్నారు.



మందుబాబులం.. మేం మందుబాబులం.. బహిరంగ ప్రదేశాల్లో తాగుతాం..ఊగుతాం..మాది ఓ ప్రత్యేక లోకం బాసూ!..క్లాసూ..మాసూ..తేడా లేదు గ్లాసు ముందు.. సూరీడు నడినెత్తికొస్తే చాలు, మా కళ్లల్లో వెలుగు నిండుద్ది. ఇక అసలు సిసలైన లోకం మొదలయ్యేదే సాయంత్రం ఆరు దాటాక.. అప్పుడే కదా సీసా సరసన కూర్చుని ప్రపంచాన్ని జయించేది. మాకు గోడలు లేవు, బంధనాలు లేవు. ఖాళీ ప్లేసే మా బార్. రోడ్డు పక్కో, చెట్టు నీడో, గుడి వెనకో... ఎక్కడ ఖాళీ దొరికితే అక్కడ మా ఆస్థానాలు.. నలుగురు కలిస్తే చాలు... లోకం మాదే..ఏ అడ్డా అయినా మాదే.. కొందరు ముక్కు మూసుకుంటారు, ఛీదరించుకుంటారు. 'ఇదేం పోయేకాలం' అని తిట్టుకుంటారు. కానీ మాకు అవేవీ పట్టవు. మా మద్యం ప్రపంచం వేరు. జోకులు పేలుతాయి, పాత కథలు గుర్తుకొస్తాయి, రాజకీయాలు చర్చిస్తాం..మధ్యలో కాస్త ఊగుతాం... అది మా స్టైల్!..ఎవరు ఇబ్బంది పడితే మాకేంటి.. చుక్కపడితే మాకు మేమే మారాజులం.. ఇలా గోపాలపట్నం ప్రాంతంలో ఏ చోట చూసినా ఇటువంటి దృశ్యాలే తారసపడుతున్నాయి. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ మందుబాబులు హల్చల్ చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే అంతా మా ఇష్టం..అంటూ తిరగబడుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే పోలీసులు కేసులు నమోదు చేయాల్సి ఉండగా..ఆ చర్యలు ఎక్కడా కానరావడం లేదు.

– గోపాలపట్నం

ఖాళీ ప్లేసే మా బార్..!



- ఎవరొచ్చినా డోంట్ కేర్
- బహిరంగ ప్రదేశాల్లో చీర్స్
- ఇబ్బంది పడుతున్న జనం
- పట్టించుకోని పోలీసులు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. దీంతో మందుబాబులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తున్నారు. మహిళలు, యువతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రదేశాలు మందుబాబులకు అడ్డాలుగా మారడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

పాఠశాల మైదానాలే నిలయాలు

ముఖ్యంగా గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాల మైదానం రాత్రి వేళల్లో మద్యం ప్రియులకు నిలయంగా మారుతోంది. ఈ దారి గుండా వెళ్లాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఉదయం పూట నడకకు వచ్చే వారికి మైదానంలో మద్యం సీసాలు ఏరడం నిత్యకృత్యంగా మారింది. కొందరు ఆకతాయిలు ఈ సీసాలను పగలగొట్టడంతో అవి ప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.చిన్నారులు సైతం ఈ సీసాలను ఆట వస్తువులుగా ఉపయోగించడం మరింత కలవరానికి గురిచేస్తోంది. అభం శుభం తెలియని పిల్లలకు మద్యం సీసాలు పరిచయం కావడం పట్ల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మందుబాబులకు అడ్డాగా..

కాలనీల్లో నిర్మానుష్య ప్రదేశాలు, ఎన్ఏడీ జంక్షన్, గోపాలపట్నం రైల్వే స్టేషన్ రహదారి వంటి ప్రాంతాలు సైతం మందుబాబుల ఆవాసాలుగా మారిపోయాయి. దీనిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, బహిరంగంగా మద్యం సేవించడాన్ని నియంత్రించాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



గోపాలపట్నం గ్రౌండ్‌లో క్రికెట్ క్రీజ్ ఇండికేటర్‌గా వాడుకుంటున్న బీర్ సీసాలు



గ్రౌండ్‌లో బీరు సీసాలు

పోలీసులు దృష్టి సారించాలి

పోలీసుల రాత్రి సమయంలో తనిఖీలు చేపట్టాలి. మందుబాబుల వల్ల ఏ ప్రమాదమూ సంభవించక ముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠినంగా శిక్షించాలి.

– ప్రభావతి, గోపాలపట్నం

మద్యం దుకాణాల వద్ద బెడద

గోపాలపట్నంలోని మద్యం దుకాణాల పరిసర ప్రాంతాల్లోనే బహిరంగంగా మద్యం సేవించే వారి సమస్య మరింత తీవ్రంగా ఉంది. దుకాణాల సమీపంలోని కాలనీల్లో నిత్యం మద్యం తాగుతూ హల్చల్ చేస్తున్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ బాటిల్స్ ఉంటే చాలు, క్షణాల్లో మద్యం సేవించి సీసాలు, గ్లాసులు అక్కడే పారేసి వెళ్లిపోతున్నారు.

– నారాయణరావు, గోపాలపట్నం

వీళ్లను అరికట్టలేరా

మద్యం షాపులకు ఆనుకుని వివిధ దుకాణాలను (రాత్రి మూసివేసిన తరువాత) బందుబాబులు అడ్డగా మార్చుకుంటున్నారు. ఆ షాపుల వద్దే బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. ఉదయం షాపులు తెరిచే సమయంలో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. వీరి ఆగడాలకు ఎవరు అడ్డుకట్ట వేస్తారు? పోలీసులే స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ఆదినారాయణ, గోపాలపట్నం



గోపాలపట్నం గ్రౌండ్‌లో బీరు సీసాలు

కొరవడిన పోలీసు నిఘా

గతంలో ఈ ప్రాంతాల్లో పోలీసుల గస్తీ ఎక్కువగా ఉండేదని, అయితే ఇటీవల అది తగ్గడంతోనే మందుబాబుల ఆగడాలు పెరిగాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో పోలీసుల బీట్ పెంచాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. బహిరంగంగా మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

మల్కాపురం: వేసవి శిక్షణ శిబిరం కార్యక్రమంలో భాగంగా మల్కాపురం శాఖ గ్రంథాలయంలో చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్ , ఇతర అంశాలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ములగాడ మండల విద్యాధికారి డీవీ త్రినాథరావు కోరారు. మల్కాపురం శాఖ గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది. జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి తదితరులు మాట్లాడారు.

వేసవిలో పెంపుడు జంతువుల సంరక్షణకు సూచనలు

సింధియా : వేసవి కాలంలో అధిక వేడిమి కారణంగా పశువులలో పాల దిగుబడి తగ్గుతుందని, డీహైడ్రేషన్, హైపర్‌థెర్మియా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని గాంధీగ్రామ్ ప్రభుత్వ పశువుల ఆసుపత్రి వైద్య అధికారి సునీల్‌కుమార్ హెచ్చరించారు. సన్‌స్ట్రోక్ వల్ల శరీర ఉష్ణోగ్రత 105 డిగ్రీలకు చేరుకుని పశువులు తీవ్ర అస్వస్థతకు గురై చనిపోయే ప్రమాదం కూడా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పాడి పశువులు ఉండే పాకలో గోనె సంచులను పరదాలుగా కట్టి వాటిని నిత్యం తడుపుతూ ఉండాలని సూచించారు. పాకలో తగినంత మంచి నీరు అందుబాటులో ఉంచాలని, నీటి స్ప్రింక్లర్ల ద్వారా పాకలో నీటిని స్ప్రే చేయాలని ఆయన తెలిపారు. మధ్యాహ్నం వేళల్లో పశువులను నీటిలో కడగాలని, మంచి పోషకాహారంతో పాటు ద్రవ పదార్థాలను ఎక్కువగా ఇవ్వాలని ఆయన సూచించారు. పెంపుడు కుక్కల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సునీల్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. వాటిని పగటిపూట ఎండలో తిప్పరాదని, నేరుగా ఎండ తగిలే చోట కట్టకూడదని, ఎక్కువ సమయం నడిపించకూడదని సూచించారు. పెంపుడు కుక్కలకు ఇచ్చే ఆహారంలో పెరుగు, మజ్జిగ, వోఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలని ఆయన సూచించారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు ఎదురైనా వెంటనే పశువైద్యులను సంప్రదించాలని సునీల్‌కుమార్ కోరారు.

ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు ప్రారంభం



రిలే దీక్షలో పాల్గొన్న కార్మికులు

మల్కాపురం : ఎస్‌ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గాజువాక ఆర్టీసీ డిపో ఎస్‌ఎంయూ ప్రధాన కార్యదర్శి పి. శంకర్ రావు మాట్లాడుతూ, 1/2019 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, గత నాలుగు సంవత్సరాలుగా నిలిచిపోయిన పదోన్నతులను వెంటనే ఇవ్వాలని, ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, 114 జీవోలో పేర్కొన్న విధంగా నైట్ అవుట్ అలవెన్సును రూ. 150 నుంచి రూ. 400 వరకు పెంచాలని కోరారు. ఆఫీసు సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా, డబుల్ డ్యూటీ అమౌంట్‌ను తక్షణమే పెంచాలని, గ్యారేజ్ ఉద్యోగుల పరిష్కారం కాని సమస్యలను వెంటనే పరిష్కరించాలని, తీవ్రమైన అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలు (ఔట్ డ్యూటీలు) కేటాయించాలని, అక్రమ సస్పెన్షన్లను వెంటనే నిలిపివేయాలని శంకరరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంయూ యూనియన్ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

ఏపీపీఏఎస్ రాష్ట్ర సమన్వయకర్తగా తోనంగి

తోనంగి వెంకటరమణియాదవ్‌ను సత్కరించిన ఏపిపిఎస్ఏ రాష్ట్ర కార్యవర్గం

మల్కాపురం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ఏపీపీఎస్ఏ) రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా 58వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు తోనంగి వెంకటరమణియాదవ్ నియమితులయ్యారు. ఏపీపీఎస్ఏ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, భీమిరెడ్డి శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు సోమారం ఆమెను ఘనంగా సత్కరించారు.



తోనంగి వెంకటరమణిని సత్కరిస్తున్న అతిథులు

తోనంగి వెంకటరమణియాదవ్ పేద విద్యార్థులకు అందిస్తున్న విద్యా సేవలు గుర్తించి ఈ పదవికి ఎంపిక చేసినట్టు అతిథులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం



ఉక్కు అడ్మిన్ వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సింగరావు

ఉక్కునగరం: కార్యరూపం దాల్చని ప్రైవేటు పరిశ్రమ కోసం క్యాప్టివ్ పోర్టు నిర్మాణం, సొంత ఐరన్ ఓర్ గనుల కోసం కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవడం సిగ్గు చేటైన విషయమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగరావు అన్నారు. ఈ వ్యవహారం ద్వారా విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని స్పష్టంగా తెలుస్తోందని ఆయన విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాలు, వేతన బకాయిలు, హెచ్‌ఆర్ఏ పునరుద్ధరణ, కరెంటు చార్జీల తగ్గింపు తదితర అంశాలపై స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు పరిపాలన భవనం వద్ద ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12. 30 గంటల వరకు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సీహెచ్. నర్సింగరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను నష్టపరుస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం దానికి మద్దతు ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి అంటే స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటూ, తద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించి రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలతో ప్రతిఘటిస్తామని ఆయన హెచ్చరించారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ , ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ, కార్మికులకు రావాల్సిన జీతాలు సక్రమంగా ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టడం అన్యాయమని అన్నారు. వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలని, హెచ్‌ఆర్‌ఏను వెంటనే పునరుద్ధరించాలని, కరెంటు చార్జీలు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్. రామారావు, కె.ఎం. శ్రీనివాస్, పి. శ్రీనివాసరాజు మరియు తదితరులు పాల్గొన్నారు.

మత పెద్దల కృషితో బాల్య వివాహాల నియంత్రణ

ఆరిలోవ: బాల్య వివాహాల నియంత్రణ కోసం వివిధ మత పెద్దలు కృషి చేయాలని అప్‌హోల్డ్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు జి.డేవిడ్ రాజు కోరారు. ఆర్గనైజేషన్ సభ్యులతో కలసి ఆయన సోమవారం పెదగదిలిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో బాలల హక్కుల సంరక్షణ, బాల్య వివాహాలు నివారించడానికి తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో అందులో భాగంగా కొన్ని చోట్ల బాల్య వివాహాలు జరిగే అవకాశముందన్నారు. అలాంటి వివాహాలు జరగకుండా అన్ని మతాల పెద్దలు అడ్డుకోవాలని కోరారు. తమ సంస్థ బాలల అక్రమ రవాణాను అడ్డుకుంటోందని తెలిపారు. ఇటీవల వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 100 మంది పిల్లలను ఆంధ్రప్రదేశ్ రైల్వే స్టేషన్లలో రైల్వే పోలీసుల సహకారంతో పట్టుకుని తిరిగి వారికి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. బాల్య వివాహాలు చేయడం, బాలలను అక్రమంగా తరలించడం తదితర కార్యకలాపాలు చట్టరీత్యా నేరమన్నారు. సమావేశంలో సభ్యులు చక్రవర్తి, ఏసురత్నం పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ కృషి

ఉక్కునగరం: దేశంలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) కృషి చేస్తోందని బీఎంఎస్ స్టీల్ ఫెడరేషన్ ఇన్‌చార్జి డీకే పాండే స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం (స్టీల్‌ప్లాంట్)లోని అంబేడ్కర్ కళాక్షేత్రంలో బీఎంఎస్ స్టీల్ ఫెడరేషన్ 17వ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల ముగింపు సందర్భంగా పలు ముఖ్యమైన తీర్మానాలు చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో యాజమాన్యం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకుంటున్న విధానాలను వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ముఖ్యంగా వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ , కంపల్సరీ రిటైర్‌మెంట్ స్కీమ్‌లను రద్దు చేయాలని కోరారు. అలాగే, కార్మికుల జీతాలు మరియు ఇతర అలవెన్సులు సక్రమంగా చెల్లించాలని, గతంలో నిలిపివేసిన ఇంటి అద్దె భత్యాన్ని తిరిగి పునరుద్ధరించాలని వారు తీర్మానించారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు తక్షణమే వేతన ఒప్పందం అమలు చేయాలని, కర్మాగారం కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

పోలీస్ కమిషనర్ చొరవతో బాలిక సంరక్షణ



పాపా హోంలో వర్షిణిని చేర్పిస్తున్న మహిళా పోలీస్

సీతమ్మధార: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చొరవతో వర్షిణి అనే 9 ఏళ్ల బాలికకు సంరక్షణ లభించింది. ఆదివారం సాయంత్రం డైమండ్ పార్క్ సమీపంలో వర్షిణి ఒంటరిగా ఉందన్న సమాచారంతో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బాలికల పాపా హోంలో ఫోర్త్ టౌన్ మహిళా పోలీస్ సిబ్బంది చేర్పించారు. వర్షిణి తల్లి దురదృష్టవశాత్తు మరణించడం, తండ్రి మద్యానికి బానిసై.. కూతురి యోగక్షేమాలను పట్టించుకోకపోవడంతో ఇంటి నుంచి వచ్చేసింది. వర్షిణి తన ఇంటి చిరునామా చెప్పలేకపోవడం వల్ల బాలిక భద్రత, తక్షణ అవసరాలను పరిగణనలోకి తీసుకుని పాపా హోంలో ఆశ్రయం కల్పించారు. వర్షిణి తన విద్యను కొనసాగించేలా సహాయ పడటానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

మల్కాపురం: స్థానిక ఐవోసీ టెర్మినల్ ప్లాంట్ వద్ద ఆయిల్ లారీ పార్కింగ్ యార్డ్‌లో మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన వాగ్వాదం దాడికి దారితీసింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి డ్రైవర్ లక్ష్మణ్ చౌహాన్ తన లారీపై లోడ్ కోసం పార్కింగ్ స్థలానికి వచ్చాడు. లోడ్ అవ్వకపోవడంతో లారీని రక్షణ గోడ పక్కన పార్క్ చేశాడు. అదే ప్రాంతంలో లారీల వద్ద క్లీనింగ్ చేసే హెల్పర్ మొహమ్మద్ ముస్తఫా ఖాన్ ఆ సమయంలో చౌహాన్ వద్దకు వచ్చాడు. ఇరువురు మద్యం సేవించి ఉండటంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సహనం కోల్పోయిన డ్రైవర్ చౌహాన్, హెల్పర్ ముస్తాఫ్ భుజంపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ముస్తాఫ్‌ను ఇతర లారీ కార్మికులు 108లో కేజీహెచ్‌కు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డ్రైవర్ చౌహాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, బద్రీనాథ్

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ పరిశ్రమలలో స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని, ఈ విషయంలో ఏ పరిశ్రమ నిర్లక్ష్యం వహించినా ఆందోళనను ఉధృతం చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు హెచ్చరించారు. పారిశ్రామిక ప్రాంత పరిధిలోని హెచ్‌పీసీఎల్, కోరమాండల్, షిప్‌యార్డ్ వంటి పరిశ్రమలలో కాంట్రాక్టర్లు స్థానికేతరులకు అధికంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల నిరుద్యోగులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. 60వ వార్డు ఇందిరా కాలనీ వద్ద జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ)లో గత మూడేళ్లుగా విస్తరణ పనులు జరుగుతున్నాయని, అయితే ఈ పనుల్లో స్థానిక నిరుద్యోగుల కంటే స్థానికేతరులకే కాంట్రాక్టర్లు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. స్థానికంగా చదువుకున్న, సాంకేతిక రంగంలో నైపుణ్యం కలిగిన నిరుద్యోగులు ఉన్నారని ఆయన వివరించారు. అలాంటి వారిని విడిచిపెట్టి, స్థానికేతరులకు ప్రాధాన్యత ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఈ సమస్యపై కాంట్రాక్టర్లు స్పందించకపోతే పారిశ్రామిక ప్రాంత పరిధిలో తమ కార్యకర్తలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ పశ్చిమ నాయకులు పోలిమేర శ్రీను, మాజీ కార్పొరేటర్లు కలిదిండి బద్రీనాథ్, గజపతిరావు, లక్కరాజు రామకృష్ణ, బిల్డర్ సంతోష్, సోమాదుల సురేష్, చికెన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతలపై అవగాహన అవసరం

గోపాలపట్నం : తూనికలు, కొలతల విషయంలో వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ కంట్రోలర్ రాధాకృష్ణ సూచించారు. సోమవారం గోపాలపట్నం రైతు బజారులో తనిఖీలు ,అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకం వేసేటప్పుడు కొనుగోలు చేసే సరుకు వేయకముందు తూనిక యంత్రం సున్నా చూపిస్తుందో లేదో సరి చూసుకోవాలని తెలిపారు. అలాగే తూకం వేసేందుకు ఉపయోగించే గిన్నె బరువును ముందుగా తీసివేశారా లేదా అని గమనించాలన్నారు. ఒకవేళ అనుమానం ఉంటే, ఈ శాఖ కార్యాలయంలో ఉన్న ధర్మకాటాపై తూకం వేయించి చూసుకోవచ్చని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఉమా సుందరి, ఎస్టేట్ అధికారి ప్రసాద్, శివ శ్రీనాథ్ పాల్గొన్నారు.